# నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు...

'ఇష్టం' అనేది వయస్సు పెరిగిన కొద్దీ మారుతూంటుంది. కొన్ని ఇష్టాలు వయసుతో బాటు పెరుగుతుంటాయి.

✦ ✦ ✦

సరస్వతితో పెళ్లయి వాళ్ల నాన్నగారిచ్చిన స్పాంజ్ పరుపు మీద కాపురం మొదలెట్టాక మా ఇద్దరికీ ప్రతీరోజూ ఒక విషయం మీద చిన్న తగాదా జరుగుతుంది. పరుపుతోబాటు కొన్న రెండు స్పాంజ్ తలగడాల్లో

ఒకటి ఎప్పుడూ నా కాళ్లకిందే ఉంటుంది. సరస్వతికి అందుకే కోపం.

"రాయిని తలకింద పెట్టుకుని పడుకోవటం మీకు అదేం వెర్రో..." అంటుంది వ్యంగ్యంగా.

"ఇది రాయి కాదు, నాకిష్టమైన తలగడ. చిన్నప్పట్నుంచీ నేనిదే వాడుతున్నాను" శోభనం రోజునే చెప్పాను తనకి. కొత్తల్లో నవ్వేది. చనువు పెరిగాక విసుక్కునేది. కొన్నేళ్లు గడిచాక నా తలగడా పిచ్చిని, పిచ్చి తలగడానీ జమిలిగా జోకులేసి తిట్టేది.

మిగిలిన అన్ని విషయాల్లో అంత అన్యోన్యంగా ఉండే ఈ పిల్ల ఒక్క దిండు విషయంలోనే తిక్కగా, చుక్కెదురుగా ఉంటుంది.

ఎప్పుడైనా ముచ్చట్ల సమయంలో ఆవిడ ఒళ్లో తలెట్టుకు పడుకుంటే... "మీ తలగడ్రాయి కన్నా నేను మీకు మెత్తగా ఉండను లెండి" అంటుంది నవ్వుతూ.

నిద్దుర పట్టేవరకూ తలకింద 'మెత్త' ఏదైనా- పడుకునే ముందు ఆ దిండుమీద తలవాల్చకపోతే నాకు నిద్దర పట్టదు. "అది దిండు కాదు దింద్రాయి. మీకన్నా మీ తలగడానే బరువు ఎక్కువ" అంటుంది సరస్వతి.

గాలి వీస్తే ఎగిరిపోయేలా బుర్రకి తగ్గట్టు నలిగిపోయేలా తలకి తగ్గట్లు ఒదిగిపోయేలా నా దిండు ఉండదేమోగానీ... నా దిండుతో నాకున్న సెంటిమెంట్, ఎటాచ్‌మెంట్ సరస్వతికి చెప్పలేను. చెబితే కామెడీ చేసి కిలారున నవ్వేస్తుంది. అందుకే ఆ కథ నేను తనతో చెప్పను. మీకు చెప్తా ఆవిడతో చెప్పకండి.

నాకు చిన్నప్పణ్నుంచీ ఉన్న బోల్డన్ని ఇష్టాల్లో సరదాల్లో ఓ సరదా

దూది ఏకి పరుపులూ, దిళ్లూ కుట్టటం నేర్చుకోవాలని.

దూదేకుల మస్తాన్ గుర్రం, గూటం పట్టుకుని దూది ఏకు తున్నప్పుడు వచ్చే శబ్దం అంటే నాకు మంత్రంలా అనిపించేది. ఓంకార నాదంలా ఆ ధ్వని నాకు వినిపించేది. ఎప్పుడో పుస్తకాల్లో చదువుకున్న గాండీవ ధనుష్టంకారం ఇలాగే ఉండేదనిపిస్తుంది. నాకే కాదు మా వయస్సు పిల్లలందరికీ ఆ ధ్వని ఎంతో ఆకర్షణీయంగా ఉండేది. ముఖ్యంగా నాకైతే అలాటి గుర్రం గూటం కొనుక్కుని అస్తమానూ దూది ఏకేస్తూ ఆనందించాలని ఉండేది. అదేమాట దూదేకుల మస్తాన్ బాయ్‌ని అడిగాను.

నా కన్నా పొడుగూ పెద్దా అయిన దూదేకులు మస్తాన్ చిన్నగా నవ్వాడు. "నువ్ పొంతులుగారి అబ్బాయివి- నీ పని ఇది కాదు" అని నచ్చజెప్పబోయాడు.

"కాదు అనకు... రాదా?" అన్నాను పెద్దగా.

మస్తాన్ నవ్వాడు. నాకా నవ్వు అర్థం కాలేదు. అయినా మస్తాన్ని నేను వదల్లేదు. 'నువ్ నేర్పకపోతేనేం నేనే చూసి నేర్చుకుంటానోయ్ సాయిబూ...' అనుకున్నాను మనస్సులో.

పాత పరుపులు చింపి దూదేకి మళ్లీ కొత్త పరుపుల్లా తయారు చేయడంలో మస్తాన్ చకచకా పని చేస్తుంటే ఎంతో ముద్దొచ్చేవాడు. ముఖ్యంగా గుర్రం చూరునించి వేలాడగట్టి దాని నారిని గూటంతో కొడుతుంటే... వచ్చే శబ్దం అతను ఏ వీధిలో పనిచేస్తున్నా వినిపించేది.

ఎవరింట్లో అతను పని మొదలుపెట్టినా నేనక్కడికి పరిగెట్టేవాణ్ణి. మస్తాన్ మొదట్లో నవ్వుకునేవాడేమో. తర్వాత్తరువాత నన్నుచూసి

పలకరింపుగా నవ్వేవాడు. వేసవి కాలంలోనే ఎక్కువగా... ఈ పాత పరుపులు కొత్తవి చేస్తారు గనుక మా సెలవులు హాయిగా వినియోగించేసుకునేవాణ్ణి.

మస్తాన్ ఝుంకార నాదానికి నేనో తుమ్మెదనై తిరిగేవాణ్ణి. అతను వాటంగా గూటం కొడుతూ దూది ఏకడాన్నీ, అందులో ఒడుపునీ చూస్తూంటే ఆయన్నేర్పకపోయినా నేను నేర్చేసుకోగలనన్న నమ్మకం రోజు రోజుకీ పెరుగుతోంది.

సాయంత్రం అతను పని ఆపేసి ఇంటికి వెళ్లిపోయాక వెదురుతో నేనూ చిన్న బాణం కట్టి కిటికీకి వేళ్లాడగట్టి దూది ఏకే ఆట ఆడుకునేవాణ్ణి. కానీ అది బాలేదు. శబ్దం రావట్లేదు. పెద్దయ్యాక నిజంగా పెద్దదే కొనుక్కోవాలి అని నిర్ణయించుకున్నాను.

రాత్రి నిద్దర్లో కలలు కూడా దూదేకుల మస్తాన్‌ని అయిపోయినట్లే ఉండేది.

మస్తాన్ ప్రేమగా పలకరించడం స్నేహంగా మాట్లాడ్డంతో చనువు పెరిగాక రెండు మూడుసార్లు గూటం కొట్టటం ప్రయత్నించాను. చేతకాలేదింకా. గుర్రం తాడునరంతో చేస్తారని చెప్పాడు. "వాటంగా కొట్టకపోతే ఎదురొచ్చి చెయ్యి కోసుకుంటుంది" అంటూండగానే... టక్కున నా చెయ్యి తెగింది. మస్తాన్‌కి కనిపించకుండా చెయ్యి దాచేసుకున్నాను. చెయ్యి తెగిందని తెలిస్తే ఇంకెప్పుడూ గూటం ముట్టుకోనివ్వడు.

ఆ తర్వాత ఇంట్లో ఎవరూ చూడకుండా, మా తాతగారి పరుపుని బ్లేడు పెట్టి కోసేశాను. ఆయన ఎలకలు కొట్టేశాయేమోనని వాటిని తిట్టి, మస్తాన్ సాయేబుని పిలుచుకుని రమ్మని నన్నే పంపారు.

నా కుట్ర ఫలించింది. ఆ వేళ మా ఇంట్లోనే నా పాఠం అన్నమాట. పన్లో పనిగా ఇంట్లో ఉన్న దిళ్లూ పరుపులూ తిరిగి కుట్టించేశాం. ఒకరోజు అనుకున్నది నాలుగు రోజులు పాఠాలు నడిచాయి.

మామూలుగా ప్రతీ కుర్రాళ్ల జీవితంలోను ఇలాంటి ఇష్టాలు ఉంటాయి. వయస్సొచ్చిన కొద్దీ కొత్త ఇష్టాలు వచ్చి పాత వాటిని తోసిపడేస్తాయి.

కొందరు ఇంకా వాటిని అంటిపెట్టుకుని అల్లరిపాలూ- నవ్వుల పాలూ అవుతామని నటనతో బతికేస్తారు.

నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు... నా ఇచ్ఛయేకాక నాకేటి వెరపు!- మా ఆవిడ నవ్వినా... నవ్వుకున్నా నన్ను ఏడ్పించినా... నాకేటి సిగ్గు?

ఆ దిండండీ...

మా మస్తాన్ నాకు 'శిష్య దక్షిణ' గా ఇచ్చాడు.

మా ఇంట్లో పరుపులు కుట్టే పనైపోయాక మేము కరణంగారింట్లో పరుపులు కుట్టడానికి వెళ్లాం. మేమంటే... మీకు చెప్పక్కరలేదు... మస్తానూ నేనూ. మూడు పాత పరుపులు చింపేసి... కొత్తవి కుట్టాలి. రెండే పెద్దవి. దాంట్లోంచి రెండు వీసెలు దూది మిగిలింది. కాదు... మిగిల్చేసి, కాదు, దాచేసి... అహా... దొంగిలించి... నాకో దిండు ప్రెజెంట్ చేశాడు మస్తాన్. ఆ దిండు నేను వదల్ను. దాని మీద పడుకుంటే నాకు ఆ ఓంకార నాదం... ఆ వేదనాదం- నా బాల్యం అంతా గుర్తొస్తాయి.

"మీ తాత దాంట్లో వెండి నాణేలు పెట్టారా? ఇందులో ఏవన్నా నిధి నిక్షేపాలు ఉన్నాయా?" అని మా ఆవిడ పదే పదే అడుగుతున్నా చెప్పలేను.

ఇంకో... కొన్నేళ్లు గడిచాక...

మా పిల్లాడు పుట్టినప్పుడు- వాడు బోర్లాపడి దొర్లిపడిపోకుండా- నా దిండ్రాయిని గొప్ప గోడలా వాడుకుంది... నా పర్మిషన్తోనే మా సరస్వతి.

కానీ... అంత చిన్న పిల్లాడికి దాని విలువ తెలియదు కదా! వాడు దాన్ని ఏం చేశాడో... మీకు చెప్పక్కర్లేదు.

ఆ దిండుని శుభ్రపరచడానికి అది తడిపింది. దూది పీకింది. దాన్ని కుట్టిన కవర్ని ఉతికి ఆరేసింది. నాకు కన్నీళ్లు తిరిగాయి. మా ఆవిడకీ నా అరుపులకి కన్నీళ్లొచ్చాయి.

ఎవరి మీద అరవాలి...

ఎందుకు అరవాలి...

నిజానికి మా పిల్లాడిమీద అరవాలి.

వాడికి అర్థం కాదు.

సరస్వతికి ఇంక ఆగలేక మొత్తం కథ చెప్పేశాను.

తను అర్థం చేసుకుంది.

ఆ దిండు మళ్లీ అలాగే కుట్టింది.

నా దిండు రడీ... అయింది.

అప్పణ్నుంచి... ఇంకెప్పుడూ సరస్వతి నా దిండు మీద జోకులు వేయలేదు.

దాని గురించి కామెంట్ కూడా చేయ్యలేదు.